



శ్యామ్ సుందర్ మంచి వాడు. ఒక గవర్నమెంట్ ఆఫీసులో గుమాస్తాగా పని చేస్తున్నాడు. అతనికి ఇంకా పెళ్ళి కాలేదు. వంటరిగా రూమ్ తీసుకుని వుంటాడు. హోటల్లో భోంచేస్తాడు.

అతనికి ఏమంత ఆస్థి పాస్తులు లేవు. కానీ బోలెడంత మంది స్నేహితులున్నారు. అతనికి కళలంటే ప్రాణం. అతనికి ఏకళలోనూ ఏమాత్రం ప్రవేశం లేదు. కానీ కళలపట్ల అభిమానం. కళాకారుల పట్ల ఆరాధన.

మంచి పాట వింటే పరిసరాలు మర్చిపోతాడు. మంచి చిత్రం చూసి ఆనందిస్తాడు. మంచి కథ చదువుతూ అందులో లీనమైపోతాడు. అతనికి ఎంతో మంది రచయితలతోను, ఆర్టిస్టులతోను, గాయకులతోను పరిచయం వుంది. తీరిక దొరికి నప్పుడు ఎవరినైనా కలుసుకుని కాలక్షేపం చెయ్యడం అతనికి చాలా ఇష్టం.

శ్యామ్ సుందర్ కి ఒక రోజు ఒక పత్రికలో ఒక మంచి కథ కనిపించింది కథపేరు 'మనసు' చిన్నకథే అయితే ఏం? సబ్జక్ట్ బాగుంది. కథనం బాగుంది. శైలి బాగుంది. లంచ గొండుల మధ్య లంచం అంటే అసహ్యించుకునే ఒక మనిషి కథ. అనుక్షణం అతను పడే సంక్షోభంఅద్భుతంగా వర్ణించాడు రచయిత.

ఆకథ ఎంతో నచ్చింది శ్యామ్ కి. ఎన్నిసార్లు చదివినా తనివి తీరనంత బాగుంది. ఆ రచయితకు తన అభినందనలు తెలియ జెయ్యాలనిపించింది. ఆ కథా రచయిత పేరు సుధాకర్. ఆపేరు ఎక్కడా విని వుండ లేదు శ్యామ్. అతని అడ్రస్ కోసం ఆ పత్రికాఫీసుకి వెళ్ళాడు.

ఆ ఆఫీసులో అతని పరిచయస్థులు వున్నారు. వాళ్ళతో కబుర్లాడి ఆ సుధాకర్ అడ్రస్ తీసుకున్నాడు. అదృష్టవశాత్తూ అతనిదీ ఆ ఊరే. కాబట్టి ఉత్తరం రాసే ఆలోచన విరమించుకుని స్వయంగా వెళ్ళి కలుసుకోవాలి అనుకున్నాడు.

ఆదివారం పొద్దున పదింటికి ఇల్లు వెతుక్కుంటూ వెళ్ళాడు. అరగంట అవస్థ పడితే దొరికింది. చిన్నరూమ్. అతి మామూలుగా వుంది. అందులో వుంటున్న సుధాకర్ కూడా అతి మామూలుగానే వున్నాడు.

శ్యామ్ ని చూసి ఆశ్చర్యపోయాడు. అతనొచ్చిన కారణం వినగానే నోరావ లించాడు. తేరుకున్నాక తెగ కంగారు పడిపోయాడు. మంచం మీద కూర్చో బెట్టి పరుగున వెళ్ళి ఎదురుగా వున్న టీ షాప్ నుంచి టీ తీసుకొచ్చి ఇచ్చాడు.

తనను వెతుక్కుంటూ వచ్చిన అభిమానిని చూసి సుధాకర్ ఎంత ఆశ్చర్యపోయాడో, తనుకు అంతగా నచ్చిన ఆ కథ సుధాకర్ తొలిరచన అనీ అంతకు ముందు కథకాదు కదా కనీసం ఉత్తరం కూడా రాసి ఎరగడనీ తెలుసుకున్న శ్యామ్ అంతే ఆశ్చర్యపోయాడు.

మొదట్లోనే అంత బాగా రాయ గలిగారంటే చాలా గొప్ప విషయం అని అభినందించాడు. రాయడం మానకండి. మరిన్ని మంచి రచనలు మాకు అందించండి అని చెప్పాడు.

మొహమాటంగా నవ్వేశాడు సుదాకర్.

వాళ్ళిద్దరి పరిచయం అంతటితో ఆగలేదు. నెల్రోజులాగి మళ్ళీ వెళ్ళాడు.

"మళ్ళీ ఏమీ రాయలేదా?" ఆసక్తిగా అడిగాడు.

"ఆ నామొహం. ఏదో ఒకటి రాశాను. ఆ తరువాత మూడ్ రాలేదు" అనేశాడు సుధాకర్ నిరాసక్తిగా.

శ్యాం అంతతేలిగ్గా వదల్లేదు. "అలా వీల్లేదు. మీలో ప్రతిభ వుందీ. దానిని రాణింపజేసుకోండి. కథలు రాయండి. రాసి నా చేతికిస్తే నాకు తెలిసిన మంచి పత్రికకి ఇస్తాను. వాళ్ళు రెమ్యూనరేషన్ కూడా ఖచ్చితంగా ఇస్తారు" అని ప్రోత్సహించాడు.

కేవలం మాటలతో వూరుకోక వెంటబడి సుధాకర్ చేత కథలు రాయించాడు. వాటిని మెచ్చుకున్నాడు, తనకి తెలిసిన పత్రికలకి ఇచ్చాడు.

అలా అలా ఓ ఏడాది తిరిగేసరికి సుధాకర్ కథలు డజను పైగా అచ్చయ్యాయి. ఈ మధ్య కాలంలో శ్యాం సుధాకర్ ల మధ్య స్నేహం బాగా పెరిగింది. నువ్వంటే నువ్వనుకోసాగారు. కలిసి భోజనం చెయ్యటం, కలిసి సినిమాలకి షికార్లకీ తిరగడం చెయ్యసాగారు.

హఠాత్తుగా శ్యాంకి ఓ ఆలోచన వచ్చింది సుధాకర్ రాసిన కథలన్నీ పుస్తకరూపంలో వేయించాలని, వెంటనే తనకు పరిచయం వున్న పబ్లిషర్ ని కలిశాడు.

విషయం విని లబలబలాడాడు పబ్లిషర్. "అసలే కథలు – అందులోనూ కొత్త రచయితవి. మహామహా వాళ్ల కథలకే దిక్కుదివాణం లేదు. ఇదినవలల యుగం.

పిల్లలు గలవాడిని మునిగిపోయాను. నన్ను మన్నించండి మహాప్రభో!' అంటూ చేతులెత్తేశాడు.

శ్యాం నిరాశ పడలేదు. ఓపిగ్గా తిరిగాడు. చివరికి అతనిలాటి సత్యకాలం పబ్లిషర్ ఒకడు దొరికాడు. శ్యాం సంబరం వర్ణనాతీతం. సుధాకర్ కూడా చాలాసంతోషించాడు.

పబ్లిషర్ సరే నన్నాక ప్రయత్నాలు మొదలు పెట్టాడు శ్యాం. ఒక మంచి రచయిత చేత తొలిపలుకు రాయించాడు. చిన్న సభ ఏర్పాటు చేశాడు. పరిచయం వున్న రచయితలని ఆహ్వానించాడు. ఒక ఫేమస్ రైటర్‌ని ముఖ్య అతిథిగా ఆహ్వానించాడు. మరో పాత ప్రముఖ రైటర్ చేత పుస్తకావిష్కరణ చేయించాలని నిర్ణయించాడు. అతిథులకి టీ ఇప్పించే ఏర్పాటు చేశాడు.

ఆ సుదినం రానే వచ్చింది. సాహిత్య సభకాబట్టి చెప్పగానే ప్రారంభం అయింది. అయితే శ్యాం పట్ల వున్న అభిమానం వల్ల కాస్త ఆలస్యంగానే అయినా అందరూ వచ్చారు.

ముఖ్య అతిథిగా విచ్చేసిన ప్రముఖ రచయిత, సుధాకర్ కథలను చాలా సిన్సియర్‌గా మెచ్చుకున్నాడు. నిజానికి ఒక నవల రాయటం కంటే ఒక కథ రాయడం కష్టం. సామాన్యంగా ఒకటో రెండో కథలు రాసి నవలలోకి దిగిపోతున్న ఈ రోజుల్లో వరుసగా ఇన్ని మంచి కథలు రాసిన సుధాకర్ నిజంగా మంచి రచయిత అని అభినందించాడు.

మరికొందరు రచయితలు కూడా సుధాకర్‌ని పొగుడుతూ మాట్లాడారు. పుస్తకావిష్కరణం జరిగింది. సుధాకర్ కృతజ్ఞతలు తెలిపాడు. శ్యాం వందన సమర్పణతో సభ ముగిసింది.

అతిథులని ఆదరంగా సాగనంపాడు శ్యాం. అతనికి ఆ రోజు ఎంతో ఆనందంగా గడిచి పోయినట్టు అనిపించింది. అంతసంతోషంగా అంతకు ముందు తనెప్పుడూ లేడనిపించింది.

తనకే ఇలా వుంటే మరి అసలు కథానాయకుడు సుధాకర్‌కి ఎలా వుంటుందో. వెంటనే సుధాకర్ కోసం చూశాడు. ఓ మూల నిలబడి వున్నాడు సుధాకర్.

ఈ మధురమైన అనుభూతిని మిత్రుడితో పంచుకోవాలనిపించింది అతనికి. ఆదరాబాదరా టీ వాళ్ళకూ, మైక్ వాళ్ళకూ డబ్బులిచ్చి పంపేసి తీరికగా సుధాకర్ దగ్గరికి వెళ్ళాడు.

శ్యాం మనసులో ఏదో ఉద్వేగం. మెల్లిగా వెళ్ళి సుధాకర్ దగ్గర నిలబడ్డాడు.

దగ్గరకు వచ్చిన శ్యాం వంక అసహనంగా నవ్వాడు సుధాకర్.

"ఇంతకీ ఆ పబ్లిషర్ డబ్బులిచ్చాడా? ఉత్తకబుర్లేనా? ఖర్చులు పోను నాకేమైనా మిగుల్తాయా?" అని అడిగాడు ఆత్రంగా. శ్యాంకి ఆ క్షణాన తెలిసొచ్చింది - అథఃపాతాళం అంటే ఏమిటో!

---

### ముఖారి గాత్రకచేరి

వి.యన్.పి. తెన్నేటి

నేను అమభూతులని జార్రుకున్న చోట-
నా వేలిముద్రలింకా చెరిగిపోలేదు.

విశీధి గుండె కోటల్లో నేను వెలిగించిన
కోటామకోట్ల కొవ్వొత్తులింకా కరిగిపోలేదు.


నేను ఎగరేసిన శ్వేతకపోతాల వైపు -
వాళ్ళు తుపాకీలు గురిపెట్టి
కాచుకూర్చున్నారు.

కాగితప్పడవల్లో ప్రయాణం చెయ్యాలని
సముద్రపొడ్డున వాళ్ళలో వాళ్ళే
కొట్టుకుచస్తున్నారు.

ఎన్ని క్షణాలు రెక్కలొచ్చి ఎగిరిపోయాయో...
-నిరుపయోగంగా!
ఎన్ని హేమంతప్రాతాలు రాలి పోతున్నాయో.....
-నిర్బంధంగా!!

ఒక వెర్రిసీతాకోక చిలుక...
సియానో మెట్లమీద కూచిపూడి
ఆడుతోంది!
రాయిలాంటి గుండెల్ని కరిగించాలని
కాబోలు
పిచ్చికోయిల ముఖారిలో పాడుతోంది!!

---




---

నేనెందుకు రాస్తున్నాను?

* మనం రాసిన దానికి నిర్ణయాధికారి పాఠకుడే! మనం ఏదో రాసినా పాఠకుడి కోసమే! 'పాఠకుడికీ జై' అనుకుని మనం రాయడం మొదలు పెడితే పాఠకుడు కూడా కొన్ని రోజులు పోయాక 'రచయితకీ జై' అనొచ్చు. అంతే!

- తంబు.

భరాగో-అత్తలూరి సంకలనం నుంచి